డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - నరసాపురం

ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు డిసెంబర్ 14వ తేదీన నరసాపురం కోర్టు సముదాయాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ తెలిపారు. ఈ మేరకు ఆమె ప్రకటన విడుదల చేశారు. ఆయా కోర్టుల్లో రాజీపడదగిన అన్ని క్రిమినల్ కేసులూ, కుటుంబ తగాదాలు, సివిల్ భూ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్టపరిహార కేసులు వంటివి రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వారివారి న్యాయవాదుల ద్వారా గాని, సంబంధిత పోలీసులను గానీ, న్యాయ సేవాధికార సంస్థను గానీ సంప్రదించాలని తెలిపారు. బ్యాంకు, బిఎస్‌ఎన్‌ఎల్‌కు సంబంధించిన లావాదేవీలు ఫ్రీ లిటిగేషన్ కేసుల కింద సెటిల్ చేసుకోవచ్చని తెలిపారు. వర్చువల్‌గా కూడా కేసులు రాజీ చేసుకునే వెసులుబాటును ఉన్నత న్యాయస్థానాలు కల్పించినట్లు న్యాయమూర్తి విజయదుర్గ తెలిపారు.

'రీసర్వే' సమస్యలు పరిష్కారమయ్యేనా..!

'ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామంలో తండ్రి కుమారునికి కొంత పొలం రిజిస్టర్ చేశారు. ఆ భూమిని ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ అధికారులు పాస్‌బుక్ సైతం ఇచ్చారు. రీసర్వే చేస్తున్నట్లు సమాచారం కూడా సదరు రైతుకు చెప్పకుండా సర్వే పూర్తయినట్లు చూపారు. కుమారుడు పేరున ఉన్న భూమి ఆన్‌లైన్‌లో మళ్లీ తండ్రి పేరున చూపిస్తోంది' ఇదేమని రెవెన్యూ అధికారులను అడిగితే ఇప్పటి వరకూ సమాధానం లేదు.'

'ఆకివీడు మండలంలోని ఓ గ్రామంలో వివాదాస్పద భూమికి సంబంధించి జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నడుస్తోంది. కనీసం సమాచారం ఇవ్వకుండా సర్వే పూర్తి చేసినట్లు చూపిన అధికారులు ఆ భూమిని మరో వ్యక్తికి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పరిస్థితి ఉంది.'

ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్

రెవెన్యూ సదస్సుల్లో రీసర్వే సమస్యలపై రైతుల వినతులు

భూముల విస్తీర్ణంలో తేడాలు, ఆన్‌లైన్ నమోదులో తప్పులే అధికం

సర్వేలో గుర్తించిన ఆక్రమణలకు గురైన చెరువుల పరిస్థితి ఏమిటో?

ఏలూరు జిల్లాలో 248 గ్రామాలు, పశ్చిమలో 173 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

రైతుల సమస్యలకు పరిష్కారం దొరికేనా అంటూ చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి హయాంలో జరిగిన రీసర్వే సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారమయ్యేనా అనే చర్చ గ్రామాల్లో నడుస్తోంది. రీసర్వే సమస్యల పరిష్కారం కోసం అంటూ ఈ నెల 16న రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 15వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. చాలామంది రైతులు రీసర్వేతో ఏర్పడిన సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో వినతులు ఇస్తున్నారు. రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు గ్రామాల్లో సరైన అవగాహన లేదని చెబుతున్న పరిస్థితి ఉంది. పూర్తిస్థాయిలో రీసర్వే జరిగిన గ్రామాల్లో మాత్రమే రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. ఏలూరు జిల్లాలో 24 మండలాల పరిధిలో 248 గ్రామాల్లో పూర్తిస్థాయిలో రీసర్వే జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాల పరిధిలో 173 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. ఆయా గ్రామాల్లో మాత్రమే రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో భూముల వివరాలు తప్పుల తడకగా నమోదు చేసినట్లు రైతులు చెబుతున్నారు. రీసర్వేపై రైతులకు నోటీసులుగాని, సమాచారంగాని ఇవ్వకుండానే సర్వే పూర్తి చేసిన పరిస్థితి ఉందని రైతులు గగ్గోలు పెట్టారు. దీంతో ఎకరం భూమి ఉంటే రీసర్వే తర్వాత 95 సెంట్లుగా నమోదు చేశారు. అదేమని రైతు సర్వే చేయించుకుంటే తన భూమి ఎకరా ఉంది. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం తక్కువ భూమి నమోదైంది. నమోదైన విషయం కూడా తన భూమిని విక్రయించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే వరకూ తెలియని పరిస్థితి ఉంది. ఒకరి పేరున ఉన్న భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్ చేయడం వంటి సమస్యలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అదేమని రైతులు ప్రశ్నిస్తే సమస్య పరిష్కారం తమ చేతుల్లో లేదని అప్పట్లో రెవెన్యూ అధికారులు తెలిపిన పరిస్థితి ఉంది. ఇలాంటి సమస్యలు ఉన్న రైతులంతా ఇప్పుడు రెవెన్యూ సదస్సుల్లో వినతులు ఇస్తున్నారు. ఈ వినతులు ఎప్పటికి పరిష్కారమవుతాయో వేచిచూడాలి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతుల పరిష్కారంపై ఏలూరు డిఆర్‌ఒ పుష్పమణిని వివరణ కోరగా సదస్సులు పూర్తయిన తర్వాత వినతుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆక్రమిత చెరువుల సంగతేంటి?

మెట్ట ప్రాంతంలో ప్రతి గ్రామంలోనూ పెద్దఎత్తున తాగు, సాగునీటి చెరువులు ఉన్నాయి. చాలా చెరువులు సెంటుభూమి కూడా మిగలకుండా ఆక్రమణకు గురైన పరిస్థితి ఉంది. ఆయా గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. ఆక్రమణకు గురైన చెరువుల భూములు సర్వేలో గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ భూములను ఆక్రమణ చెర నుంచి తప్పించి చెరువులను కాపాడేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో అర్థం కావడం లేదు. ఆక్రమణల్లోని చెరువుల భూములను స్వాధీనం చేసుకోకపోతే రీసర్వే ఉపయోగం ఏమిటని, రెవెన్యూ సదస్సుల వల్ల ప్రయోజనం ఏమిటనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. భీమడోలు మండలం పొలసానిపల్లి రెవెన్యూ పరిధిలో 40 వరకూ చెరువులు ఉన్నట్లు తెలుస్తోంది. చెరువులన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. ఈ చెరువుల భూములపై అధికారులు ఎటువంటి స్పష్టతా ఇవ్వడం లేదు. అత్యధికంగా మెట్టప్రాంతంలో వందలాది చెరువుల పరిస్థితి ఇలానే ఉంది. దీంతో రెవెన్యూ సదస్సుల తీరుపై గ్రామాల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

దీపావళికి ఉచిత సిలిండర్

ఏలూరు జిల్లాలో 6.44 లక్షలు, పశ్చిమలో 6.25 లక్షల గ్యాస్ కనెక్షన్లు

విధివిధానాలపై స్పష్టత కోసం ఎదురుచూపు

బిపిఎల్ పరిధిలోని జనరల్ కనెక్షన్‌దారులకు ఉచిత గ్యాస్ అందేనా?

ఇసుక లేకుండా సీనరేజ్, జిఎస్‌టి రద్దుతో ప్రయోజనం ఏమిటని ప్రశ్నలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏడాదికి ఉచితంగా మూడు వంటగ్యాస్ సిలిండర్ల అందజేత పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభించేందుకు, ఇసుకపై సీనరేజ్, జిఎస్‌టి రద్దుకు రాష్ట్ర మంత్రిమండలి బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో ఉచిత గ్యాస్ సిలిండర్ల అందజేతపై జనాల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించకపోవడంపై ఈ పథకం ఏవిధంగా అమలు చేస్తారో అర్థంకాని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో 6.44 వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో దీపం కనెక్షన్లు 1.91 లక్షలు, ఉజ్వల కనెక్షన్లు 27,639, సిఎస్‌ఆర్ కనెక్షన్లు 18,243, మిగిలిన నాలుగు లక్షలకుపైగా జనరల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పశ్చిమలో మొత్తం 6.25 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, దీపం వినియోగదారులు లక్షా 85 వేల వరకూ ఉన్నారు. మిగిలినవి ఇతర గ్యాస్ కనెక్షన్లుగా ఉన్నాయి. ఈ నెల 25 నుంచి నెలాఖరు వరకూ ఉచిత గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోవాలని, తర్వాత వాటిని అందించడం జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. నాలుగు నెలలకు ఒక ఉచిత సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించింది. వినియోగదారులు పూర్తిగా సొమ్ము చెల్లించి సిలిండర్ కొనుగోలు చేసిన తర్వాత ఆ సొమ్మును 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో వేసేలా కేబినెట్‌లో ఆమోదముద్ర పడింది. అయితే బిపిఎల్ పరిధిలోని తెల్లకార్డుదారులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం వర్తింపజేస్తారా, లేక షరతులు విధిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలు ప్రకటించాల్సి ఉంది.

ఇసుక లేదాయే..!

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇసుక కోసం జనం నానాపాట్లు పడుతున్నారు. రెండు జిల్లాల్లో ఇసుక ర్యాంపులు ఇప్పటికీ తెరుచుకోలేదు. కుక్కునూరు మండలం ఇబ్రహీంపేటలో ఇసుక ఉన్నట్లు చెబుతున్నా ఆన్‌లైన్‌లో బుక్ కావడం లేదు. ఆన్‌లైన్‌లో ఇసుక దొరకడం లేదుగాని, బ్లాక్‌మార్కెట్‌లో మాత్రం ఇసుక పుష్కలంగా దొరుకుతోంది. ఇసుక అందుబాటులోకి తీసుకురాకుండా సీనరేజ్, జిఎస్‌టి రద్దు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటనే చర్చ జనాల్లో నడుస్తోంది. ఉచిత ఇసుక పేరుతో అసలు ఇసుకే లేకుండా చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అందుబాటులోకి తెస్తే ప్రభుత్వం రద్దు చేసిన జిఎస్‌టి, సీనరేజ్‌తో జనానికి ఉపయోగం ఉంటుంది. ప్రస్తుతం బ్లాక్‌మార్కెట్‌లో 20 టన్నుల ఇసుక రూ.29 వేలు వరకూ విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ముందుగా ఇసుకను అందుబాటులోకి తేవాలని జనం కోరుతున్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతివ్వాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - పోడూరు

విద్యతో పాటు, క్రీడలకు కూడా ప్రాధాన్యతివ్వాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి మండలంలోని కవిటం పిఎంపి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించి మధ్యాహ్న భోజనం అందరూ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మంచి పోషకాలతో కలిగిన ఆహారం తీసుకున్నప్పుడే ఉత్సాహంగా ఉండడంతో పాటు చదువుపై ఏకాగ్రత ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాఠశాలలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజనాన్ని తప్పకుండా స్వీకరించాలన్నారు. సాంకేతిక విద్య, వ్యవసాయ విద్యలపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని, పదో తరగతి అనంతరం ఏయే కోర్సులు అందుబాటులో ఉన్నాయో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మార్టేరులో వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఉందని మీకు తెలుసా అని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యనభ్యసించడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలు పొందొచ్చని సూచించారు. విద్యార్థులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఎంఇఒ జిఒ సూర్యనారాయణ, తహశీల్దార్ ఎస్‌ఎం.ఫాజిల్ ఉన్నారు.



పోడూరు: విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పెనుమంట్ర : విద్యార్థులు మట్టితో అనుబంధం పెంచుకునేలా వ్యవసాయ విద్యనభ్యసించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం మార్టేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి రైతు ప్రధానమన్నారు. విద్యార్థులు మట్టితో అనుబంధం పెంచుకోవాలన్నారు. పదో తరగతి తర్వాత ఏయే కోర్సులు అభ్యసించాలనే విషయాలను ఉపాధ్యాయులు ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎంపిసి చదివి ఇంజినీరింగ్ విద్యపై మక్కువ చూపకుండా, సాంకేతిక విద్య పాలిటెక్నిక్, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి ఉన్నతంగా చదువుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రతి విద్యార్థీ స్వీకరించాలన్నారు. కలెక్టర్ వెంట పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ చిన్న సూర్యనారాయణరెడ్డి, తహశీల్దార్ రవికుమార్, తదితరులు ఉన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - పెనుగొండ

ప్రభుత్వ వైద్యులు ప్రజలకు చేరువుగా ఉండి నాణ్యమైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఒపి, పేషెంట్లు ఉండే వార్డులను, ల్యాబ్ టెస్టులు ఎక్సరే టెస్టులు, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, మందులను, రిజిస్టర్లను పరిశీలించారు. ల్యాబ్ టెస్టులు, ఎక్సరే టెస్టులు రోజుకు ఎన్ని జరుగుతున్నాయని ఆరా తీశారు. షుగర్‌కు, బిపికి సంబంధించిన మందులను పేషెంట్లకు ఎలా ఇస్తున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రోగులతో మాట్లాడారు. వైద్య సదుపాయాలు ఎలా అందుతున్నాయి, డాక్టర్లు బాగా చూస్తున్నారా, ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా అని ఆరా తీశారు. ఇబ్బందులుంటే తెలపాలని సూచించారు. ప్రతిరోజూ పేషెంట్లు ఎంతమంది వస్తున్నారు, డిశ్చార్జి ఎంతమంది అవుతున్నారు, కాన్పుల కోసం వచ్చేవారికి ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు, గర్భిణులు ఎంతమంది ఉన్నారు, ప్రసవాలు గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఫోటో తెరఫీ బాక్సుల్లో పెట్టే పిల్లలను వార్డుల్లో కాకుండా ప్రత్యేకంగా ఒక రూములో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్యులు 24 గంటలూ పేషెంట్లకు అందుబాటులో ఉండాలన్నారు. పేద ప్రజలకు వైద్యం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్ర సవేరి, తహశీల్దార్ జి.అనిత కుమారి, సిబ్బంది ఉన్నారు.

పేషెంట్లతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పెంటపాడు

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు దూలం ప్రసాద్, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంపై లక్షలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారని, ఈ రంగానికి ప్రధాన వనరు ఇసుక అని తెలిపారు. ఇసుక గురించి గత వైసీపీ ప్రభుత్వం నుంచి కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం 1214 జిఒ విడుదల చేసి భవన నిర్మాణ కార్మిక రంగానికి ఆయువు పట్టుగా ఉన్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఉచిత ఇసుక అమలు చేస్తామని చేసిన వాగ్దానం నేటికీ అమలు కాలేదని తెలిపారు. దీంతో ఉపాధి లేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని వారు తెలిపారు. ఓ పక్క నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి కరెంట్ ఛార్జీలు తదితర భారాలు ప్రజలపై పడుతున్నాయని, భారాలు మోయలేక వారు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ, ఆకుల రాజు, బత్తుల ప్రసాద్, రుద్ర వేణురెడ్డి, పోలి నాయుడు, కవల కృష్ణ, బొంతల నాగరాజు, శివ, పత్తివాడ శ్రీరాములు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నేతలు

రోడ్లు మెరుగుపర్చకపోతే పోరాటాలు ఉధృతం

సిపిఐ దీక్షకు సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం చేరుకోవడానికి సరైన రోడ్డు లేదని, జిల్లాలోని రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, రోడ్లు మెరుగుపర్చకపోతే మరిన్ని పోరాటాలు చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం హెచ్చరించారు. జిల్లా కేంద్రమైన భీమవరం చేరుకునే ప్రధాన రహదారులను తక్షణం పునర్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ప్రకాశంచౌక్‌లో చేపట్టిన 32 గంటల నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షకు బలరాం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని, ప్రాణాలు హరించుకు పోతున్నాయని విమర్శించారు. గత పాలకుల నిర్లక్ష్యమే కనిపించినా, ప్రస్తుత కూటమి సర్కార్ దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో నిత్యం ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. వైరల్ జ్వరాలతో, నిత్యావసర ధరల పెంపుతో సతమతమవుతుంటే రోడ్డు ప్రమాదాలు అదనంగా చేరాయని విమర్శించారు. వర్షాలపై వంకలు పెట్టకుండా తక్షణం పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు తదితరులు మాట్లాడారు. ఈ దీక్షల్లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, జిల్లా సమితి సభ్యులు మండల నాగేశ్వరరావు, నామాన వెంకటేశ్వరరావు, ఉల్లింకల జయకృష్ణ, కిలారి మల్లేశ్వరరావు, వైవి ఆనంద్, నేతలు పాల్గొన్నారు.

దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న బలరాం

బొబ్బనపల్లిలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - వీరవాసరం

బొబ్బనపల్లి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం ఎడిఎ చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ అధికంగా పురుగులమందు వాడకాన్ని తగ్గించాలని, విచ్చలవిడిగా పురుగులమందులు, ఎరువులు వాడకూడదని రైతులకు సూచించారు. మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ వారి డిపార్ట్మెంట్‌లో జరుగుతున్న కార్యకలాపాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బిన్నీ బాబు, వివివి.నాగరాజు, రైతులు మోపిదేవి జగన్ మోహన్, మల్లుల చింతన్న పాల్గొన్నారు.

'ఉచిత బస్సు హామీ' పై పోస్ట్ కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - కాళ్ల

ఎవి లో కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు హామీ నెరవేర్చాలని కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిళ ఆదేశాల మేరకు వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో కాళ్లకూరులో పోస్టు కార్డు ఉద్యమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యమంత్రికి ఉచిత బస్సు హామీని నెరవేర్చాలని కోరుతూ పోస్టుకార్డులు రాయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొల్లి సత్యశ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కొండా రాజేష్‌కుమార్, గంజాల సుబ్రహ్మణ్యం, ఎన్.నందీశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

కాళ్లకూరులో పోస్టుకార్డులతో నిరసన చేస్తున్న నేతలు

సర్వే మొత్తం తప్పులతడకే..

అధికారుల ముందు రైతుల గగ్గోలు

ప్రజాశక్తి - ఉండి

గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూ రీసర్వే మొత్తం తప్పుల తడకగా జరిగిందని అర్ధమూరు గ్రామస్తులు అధికారుల ముందు గగ్గోలు పెట్టారు. బుధవారం అర్తమూరులో నిర్వహించిన గ్రామసభలో 44 మంది రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమ గ్రామం మొత్తం ఆక్వా చెరువులతో నిండిపోయిందని, అటువంటి చెరువులను ఏవిధంగా రీసర్వే చేశారని ప్రశ్నించారు. తమ చెరువులపైకి డ్రోన్‌ను పంపి, అధికారులు కార్యాలయాల్లో ఉండి తమ చెరువులను సర్వే చేసినట్లు చెప్పుకొని తమకు నచ్చిన విధంగా ఆన్‌లైన్ చేశారని ఎక్కువ మందికి ఒకటే ఎల్‌పి నంబర్ ఇవ్వడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే పకడ్బందీగా నిర్వహించలేదని విమర్శించారు. దీనిపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ మాట్లాడుతూ రీసర్వేలో ఎల్‌పి నంబర్లు సమిష్టిగా వచ్చిన రైతులు వేర్వేరు ఎల్‌పి నంబర్ల కోసం దరఖాస్తు చేసుకుంటే విడిగా ఎల్‌పి నంబర్ వచ్చేందుకు సాధ్యపడుతుందన్నారు. రైతుల సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలను ఏర్పాటు చేస్తుందన్నారు. మండల సర్వేయర్ రత్నావలి మాట్లాడారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రత్నావళి, గ్రామ పంచాయతీ సర్పంచి గోనబోయిన వీర్రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్, గ్రామ రెవెన్యూ అధికారి కృష్ణంరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండల సర్వేయర్ రత్నావలి

డ్రోన్లతో వ్యవసాయ సంరక్షణకు చర్యలు : జెసి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో డ్రోన్ల వినియోగం ద్వారా వ్యవసాయ సస్యరక్షణకు చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి సీకే కన్వెన్షన్లో మంగళవారం ప్రారంభించిన డ్రోన్ సమ్మిట్‌లో భాగంగా ఏర్పాటుచేసిన వివిధ రకాల డ్రోన్లను బుధవారం జెసి సీకే కన్వెన్షన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు డ్రోన్లను విరివిగా వాడేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని డ్రోన్లు జిల్లాలో అందుబాటులో ఉంచేందుకు ఎస్‌హెచ్‌జి మహిళలకు, వారి కుటుంబ సభ్యులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పారిశుధ్యం మెరుగుదలకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. వార్డుల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో మురుగునీరు నిల్వ లేకుండా డ్రెయినేజీల్లో సీడ్‌ను తొలగిస్తున్నామన్నారు. వార్డుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను జెసిబిల ద్వారా తీస్తున్నామన్నారు. రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలు తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ప్రసాద్, కిషోర్, సచివాలయ సిబంది పాల్గొన్నారు.

రొయ్యలు, చేపల మేత రంగంలోకి..

టాటా గ్రూపు రాక శుభపరిణామం

ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చేపలు, రొయ్యల మేతల రంగంలోకి టాటా గ్రూప్ రావడం శుభ పరిణామమని ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక ఆక్వా హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్, ఫీడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎంఎల్‌ఎ అంజిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆక్వా రైతులకు నాణ్యమైన రొయ్యలు, చేపల మేత అతి తక్కువ ధరల్లో అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాల్లో ఎన్నో రంగాల్లో విస్తరించిన టాటా గ్రూప్ భీమవరానికి రావడం శుభ సంకేతమన్నారు. దేశంలో ప్రతి కుటుంబమూ ఉదయం నుంచి రాత్రి వరకూ టాటా గ్రూపునకు చెందిన ఏదోక ఉత్పత్తిని వినియోగిస్తోందని తెలిపారు. రైతులందరికీ అందుబాటు ధరల్లో రొయ్యలు, చేపల మేతను అందించాలన్నారు. అనంతరం టాటా ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలోని టాటా ర్యాలీస్ ఇండియా రూపొందించిన 12 రకాల ఉత్పత్తులను రామరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా రతన్‌టాటా చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. నీతి, నిజాయితీకి రతన్ టాటా నిదర్శనమన్నారు.

చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కాశిపాడులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో పారిశుధ్య నిర్మూలనకు కృషిచేస్తున్నట్లు కాశిపాడు సర్పంచి తెర్లి నాగరాజు చెప్పారు. బుధవారం గ్రామంలో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో మురికినీరు నిల్వ లేకుండా డ్రెయినేజీలలో సిల్ట్‌ని తొలగిస్తున్నట్లు చెప్పారు. వార్డుల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాలను జెసిబి ద్వారా తొలగిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జి.జాషువా, అసిస్టెంట్ ఇంజనీర్ లావణ్య, ఎన్.సుధాకర్ రాజు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

అర్హులైన పట్టభద్రులంతా ఎంఎల్‌సి ఓటు నమోదుకు నవంబర్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నరసాపురం తహశీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. అక్టోబర్ 2021 నాటికి పట్టభద్రులైన వారంతా అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదుకు ఫారం-18తో పాటు అటెస్టేషన్ చేయించిన డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలు, ఓటరు కార్డు నకలు, ఫొటో, మొబైల్ నంబర్‌ను నిర్దేశిత కేంద్రాల్లో అందజేయాలన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

తహశీల్దార్ రాజకిషోర్

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణిలు సూచించారు. మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను నిర్దేశ సమయంలోనే అన్నింటిని పరిష్కరించాలని సూచించారు.


కందిపప్పు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

రేషన్ షాపు తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని కొప్పర్రు గ్రామంలో రేషన్ షాపు నంబర్ 89ని బుధవారం నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పేదలకు అందవలసిన నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతున్నాయా, లేదా.. అనే విషయంపై డీలర్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. రేషన్ షాపులో ఉండవలసిన సరుకులు ఉన్నవి, లేనివి పరిశీలించారు. ఆయన వెంట సివిల్ సప్లయిస్ డిటి ఎ.సత్యనారాయణ, విఆర్‌ఒ వినోద్ ఉన్నారు.


మంత్రి కందుల దుర్గేష్‌తో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నాయకర్

నరసాపురాన్ని అభివృద్ధి చేయాలి

మంత్రిని కోరిన ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సముద్ర తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ కోరారు. బుధవారం మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో కలుసుకుని నరసాపురం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కందుల దుర్గేష్ హామీ ఇచ్చినట్లు ఎంఎల్‌ఎ నాయకర్ తెలిపారు.

గొలుసు దొంగలున్నారు జాగ్రత్త

ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా

ప్రజాశక్తి - ఉండి

మండలంలో గొలుసు దొంగలు ఎక్కువయ్యారని, ఒంటరిగా వెళ్లేటప్పుడు జాగ్రత్తలు వహించాలని ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా బుధవారం సాయంత్రం మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నసీరుల్లా మాట్లాడుతూ మహిళలు ఒంటరిగా వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నగలు కనపడకుండా చున్నీ కప్పుకోవడం గాని, చీర కప్పుకోవడం గాని చేయాలని సూచించారు. ఉదయం వేళ వాకింగ్ వెళ్లేటప్పుడు తెలిసిన వారితో ఇద్దరూ అంతకంటే ఎక్కువ మంది వాకింగ్ చేసేలా చూడాలని అన్నారు. ఎవరైనా ఊరు వెళ్తే డబ్బు, బంగారు నగలు జాగ్రత్తపరుచుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ వారి నివాసాల వద్ద, దుకాణాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు.

26 నుంచి టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఈనెల 26న మొదలయ్యే టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్రంలోనే అత్యధిక సభ్యత్వాలు మన నియోజకవర్గంలో నమోదు కావాలన్నారు. సభ్యత్వాలు అధికంగా పూర్తి అయ్యేలా ప్రతి కార్యకర్త, నాయకులు క్రియాశీలకంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్ర, పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, సీనియర్ నాయకులు అధికారి అనంతరామారావు, మాజీ వైస్ ఛైర్మన్ పొన్నాల నాగబాబు, సీనియర్ నాయకులు శంకు భాస్కర్ రావు, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, శ్రీను, కోరాడ పాపారావు, కొప్పాడి సత్యనారాయణ, తిరుమాని శశిదేవి, బొర్రా చిన్నయమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజారక్షణలో రక్షకభటులది ప్రముఖ పాత్ర

వన్‌టౌన్ సిఐ నాగరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజా రక్షణలో రక్త సంబంధీకులకన్నా ముందుగా స్పందించేది రక్షక భటులని, ప్రతిరోజూ ప్రమాదాలతో సాహసం పోలీసుల నిత్యకృత్యమని భీమవరం వన్‌టౌన్ సిఐ నాగరాజు అన్నారు. బుధవారం భీమవరం కెజిఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగరాజు మాట్లాడుతూ వీరోచిత పోరాటం చేసి, అశువులు బాసి అమరులైన పోలీసులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రాఘవ మాట్లాడుతూ నిత్యం ప్రజారక్షణే లక్ష్యంగా ఉండేది పోలీసులేనని, పోలీసు వ్యవస్థలో మన కళాశాల ఫార్మసీ విద్యార్థిని ఆరవ మానస అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం పొందారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు పోలీసు వ్యవస్థ విధివిధానాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించామని, అనంతరం రెస్ట్ హౌస్ రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ నాగరాజు

నరసాపురం : మాట్లాడుతున్న ఉప తహశీల్దార్ ప్రసాద్

గ్రామసభలను వినియోగించుకోవాలి

ఉప తహశీల్దార్ ప్రసాద్

ప్రజాశక్తి - నరసాపురం

రీ సర్వే సందర్భంగా రైతులకు సంబంధించిన భూసమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉప తహశీల్దార్ ఎన్ఎస్ఎస్‌వి ప్రసాద్ అన్నారు. మండలంలోని లిఖితపూడి గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచి పోతురాజు వరలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. భూములకు సంబంధించిన సమస్యలపై గ్రామ సభల్లో రైతుల నుంచి అందుతున్న అర్జీలన్నింటినీ పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. గ్రామసభలో విఆర్ఒలు ఆచంట జయరామ్, హేమభద్రరావు, వీరాంజనేయులు, ఎంపిటిసి సభ్యుడు వెంకటరావు, మాజీ సర్పంచులు మెరుగుమువ్వల రాంప్రసాద్, చొప్పల సూర్య ప్రకాశరావు, సర్వేయర్ కొప్పినీడి విజయమోహన్, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ

తహశీల్దార్ పవన్‌కుమార్

యలమంచిలి : రీ సర్వే పూర్తయిన గ్రామాలలో భూ సమస్యలు ఏమైనా ఉంటే ఈనెల 31వ తేదీ లోపు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని చించినాడ గ్రామంలో రైతుల నుంచి వినతులు స్వీకరించుటకు గ్రామసభ నిర్వహించారు. చించినాడ గ్రామంలోని జాయింట్ ఎల్‌పిఎం మొత్తం 331లో 12 మంది రైతులు సబ్ డివిజన్‌కు దరఖాస్తులు రావటంపై, గ్రామ సర్వేయర్‌తో పాటు మిగిలిన రైతులకు తహశీల్దార్ పవన్ కుమార్ అవగాహన కల్పించారు. అనంతరం ఈ గ్రామ సభలో జాయింట్ ఎల్‌పిఎం సబ్ డివిజన్‌కు 12 దరఖాస్తులు, మ్యూటేషన్‌కు 8 దరఖాస్తులు, విస్తీర్ణం సవరణకు 10, కొరిలేషన్ 2, మొత్తం 32 దరఖాస్తులను తహశీల్దార్ స్వీకరించారు. ఈ దరఖాస్తులపై విచారణ జరిపి తదుపరి చర్య తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పి.వెంకటేశ్వరరావు, డెప్యూటీ తహశీల్దార్ పి.డేవిడ్ సన్, ఆర్ఐ యశోద, సర్పంచి రాజామణి, ఎంపిటిసి సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో 26న జాబ్‌మేళా

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఈనెల 26వ తేదీ శనివారం మెగా జాబ్ మేళా ద్వారా వివిధ కంపెనీలలో ఇంటర్వ్యూలు నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలు అనగా స్టీల్ టిప్స్ వీల్స్ ఇండియా ప్రై.లి., ఏషియన్ ఆటో పార్ట్స్ ఇండియా ప్రై.లి., ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, అపోలో ఫార్మసీ, ఫ్యూషన్ ఫైనాన్స్, హీరో మోటార్స్, పేటీఎం, ఎపి ఎసి ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్లూ స్టార్, డైకన్, వింటేక్ కంపెనీ, న్యూ లింక్, ఫాక్స్ కాన్, ప్రీమియర్ వంటి 16 కంపెనీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్వ్యూలకు డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన నిరుద్యోగులు తమ ఫొటో ఉన్న రెస్యూమ్స్‌తో పాటు సర్టిఫికెట్ జిరాక్స్‌లతో ఉదయం 8:30కు కళాశాలలో జరిగే రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో పాల్గొని ఉద్యోగ అవకాశం పొందాలని కోరారు. ఈ జాబ్‌మేళాకు సంబంధించి మరిన్ని వివరములు కళాశాల వెబ్‌సైట్ %www.sriasnmgdcpalakol.ac.in% లో పొందుపర్చడమైందని తెలిపారు.

మంత్రి రవికుమార్‌ను కలిసిన ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి, పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి గొట్టిపాటి రవికుమార్‌ని మంగళగిరిలో నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి రవి కుమార్‌కి ఎంఎల్‌ఎ నాయకర్ వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని అందించారు. ఈ సందర్భంగా నియోజవర్గంలోని పలు విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. నరసాపురం నియోజవర్గానికి రావాలని ఎంఎల్‌ఎ నాయకర్ కోరారు.

ఉపాధి పనులతోనే గ్రామాలాభివృద్ధి

ఉండి : ఉపాధి పనులతోనే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమెగా రాజు అన్నారు. బుధవారం ఉండి మండలం చెరుకువాడ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభను ఉద్దేశించి ఒమేగా రాజు మాట్లాడుతూ 2024-25కు సంబంధించి ఉపాధి పనులు గుర్తించడం జరిగిందని, ప్రతి ఒక్కరికీ 100 పనిదినాలు కల్పిస్తామని అన్నారు. పంట కాలువలు, మురుగు బోదెలు వెంబడి ఉన్న మొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించేందుకు ఉపాధి కూలీలను ఉపయోగించుకోవాలని గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావును కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, పాలకవర్గ సభ్యులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

25 నుంచి మార్టేరు-పాలకొల్లు రోడ్డు వెడల్పు పనులు

10 వరకూ వాహనాల మళ్లింపు

ఆర్అండ్‌బి తణుకు జెఇ జస్వంత్ వెల్లడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 25వ తేదీ నుంచి డిసెంబర్ 10 వరకు 45 రోజులు మార్టేరు-పాలకొల్లు రోడ్డులో వాహనాల మళ్లింపు ఉంటుందని ఆర్ అండ్ బి తణుకు డివిజన్ జెఇ జస్వంత్ తెలిపారు. మండలంలోని మార్టేరు సెంటర్‌లోని వంతెన నుంచి పాలకొల్లులోని లారీల స్టాండు వరకు ఆర్ అండ్ బి చేపట్టిన రోడ్డు వెడల్పు నిర్మాణం కోసం ఈ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మార్టేరులో విలేకరులతో మాట్లాడుతూ వాహనదారులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తీవ్రంగా పాడైన మార్టేరు వంతెన నుంచి కనకదుర్గమ్మ గుడి వరకు 700 మీటర్లు సిమ్మెంట్ రోడ్డు, పాలకొల్లు వరకు 9 కిలోమీటర్లు బిటి రోడ్డు నిర్మాణం చేస్తున్నామని తెలిపారు.

ఆలమూరు మీదుగా ట్రాఫిక్ మళ్లింపు : ఈ మార్గంలో పాలకొల్లు వెళ్లే వాహనాలు ఆలమూరు, ఓడూరు, కొమ్ము చిక్కాల, లంకలకోడేరు మీదుగా పాలకొల్లు చేరాలని, అదేవిధంగా పాలకొల్లు నుంచి ఇటువైపు వచ్చే వాహనాలు రావాలని పేర్కొన్నారు. ఈ 45 రోజుల్లో పూర్తిగా మార్టేరు నుంచి పాలకొల్లు రోడ్డు వెడల్పు నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి

జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు

ప్రజాశక్తి - ఉండి


ఉండి : ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న జుత్తిగ నాగరాజు

మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఉండి మండలం మహాదేవపట్నం గ్రామంలో ఆధార్ క్యాంపును గ్రామ సర్పంచి వణిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్ ప్రారంభించగా ముఖ్యఅతిథిగా జుత్తిగ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆధార్ అప్డేట్ తప్పనిసరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ క్యాంపులలో అన్ని రకాల ఆధార్ సేవలు అందిస్తున్నారని తెలిపారు. గతంలో ఉండి మండలానికి సంబంధించి ఆధార్ అప్డేట్ కోసం భీమవరం వెళ్లి ఇబ్బందులు పడే వారన్నారు. కానీ నేడు ప్రభుత్వం విద్యార్థుల వద్దకే ఆధార్ సేవలను అందిస్తుందని, విద్యార్థులు వారికి కావలసిన మార్పులను, చేర్పులను సకాలంలో చేసుకోవచ్చని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి సైదాడ చిన్నారావు, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం : ఆధార్ కేంద్రాలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. పట్టణంలో ఈనెల 25 వరకూ ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకూ టైలర్ పేట, కోటవద్ద పాలెం, మున్సిబ్ గారి వీధి, చినమామిడి పల్లి నాలుగు సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు అవసరమైనవారు తగు పత్రాలతో వచ్చి ఈ సేవలు పొందాలన్నారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నరసాపురం

షాపులు తనిఖీ చేస్తున్న జిల్లా ఫైర్ ఆఫీసర్

దీపావళి క్రాకర్స్ హోల్‌సేల్ షాపు యజమానులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని పశ్చిమగోదావరి జిల్లా ఫైర్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని నరసాపురం-పాలకొల్లు రోడ్డు లోని దీపావళి క్రాకర్స్ హోల్‌సేల్ షాపులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మందు గుండు సామాగ్రి తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్, ఫైర్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా షాపు యజమానులకు ఆయన పలు సలహాలు, సూచనలు అందించారు. ఆయన వెంట నరసాపురం ఫైర్ ఆఫీసర్ కె.రామ్ భాస్కర్, భాను, సిబ్బంది ఉన్నారు.

టిడ్కో ఛైర్మన్‌గా అజయ్‌కుమార్ బాధ్యతలు

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర టిడ్కో ఛైర్మన్‌గా వేములపాటి అజయ్‌కుమార్ మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్నా) హాజరయ్యారు. ఇరువురూ అజయ్ కుమార్‌కు అభినందనలు తెలియజేసి సన్మానించారు.


అజయ్ కుమార్‌ను సత్కరిస్తున్న చిన్నా

పలుచోట్ల ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు

పాలకొల్లు రూరల్ : దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకలకోడేరు గ్రామ పంచాయతీ వెదళ్లపాలెం రెబల్ స్టార్ ప్రభాస్ యూత్ ఆధ్వర్యంలో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ సామాజిక సేవా సంస్థ వృద్ధాశ్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహనరావు విచ్చేసి ప్రభాస్ యూత్ వారు చేతుల మీదుగా వృద్ధులకు బిర్యానీ, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగర రామ్మోహనరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా వృద్ధులకు సేవలందిస్తున్న జోగాడ ఉమామహేశ్వరరావును అభినందించారు. ప్రతీ ఏడాది తన పుట్టినరోజుకి రాహుల్ ఆశ్రమానికి అన్నదానం, వస్త్రదానం చేస్తున్నానని, అలాగే ప్రతి ఏడాది చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగరతో పాటు జోగడ ఉమామహేశ్వరరావు, ప్రభాస్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

మొగల్తూరు : పాన్ ఇండియా యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ మొగల్తూరుకి గర్వకారణమని మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ప్రభాస్ అభిమానులు భారీగా ద్విచక్ర వాహన ప్రదర్శన చేశారు. ఆయా గ్రామాల్లో కేకులు ఏర్పాటు చేసి కట్ చేశారు. మండలకేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేకును మాధవ నాయుడు కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన నటనతో పాటు సేవా కార్యక్రమాలు కూడా భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారని అన్నారు. జాతీయస్థాయిలో మొగల్తూరు పేరు నిలబెట్టారని కొనియాడారు. పలువురు అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించి మీడియా ప్రతినిధులపై దౌర్జన్యానికి దిగారు. ఆయా కార్యక్రమాల్లో కలిదిండి కుమార్ బాబు, మామిడిశెట్టి సత్యనారాయణ, దంపనబోయిన సత్యనారాయణ, బస్వాని ఏడుకొండలు, చింతపల్లి రవికుమార్, దొంగ కనకేశ్వరరావు, కొల్లాటి హరికృష్ణ, పులపర్తి దత్తు, పలువురు అభిమానులు ఉన్నారు.


మొగల్తూరు : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంఎల్‌ఎ

నరసాపురంలో..

నరసాపురం : యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు వేడుకలను నరసాపురం కనకదుర్గ థియేటర్ వద్ద ప్రభాస్ అభిమానుల సమక్షంలో నరసాపురం మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. పట్టణ వీధుల గుండా అభిమానులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేదిక వద్ద ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేసి అభిమానులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమను ప్రపంచ నలుమూలలా వ్యాప్తి చేసిన నటుడు ప్రభాస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండేటి శ్రీను, బస్వాని ఏడుకొండలు, కలిదిండి కుమార్ బాబు, దొంగ సత్యనారాయణ, కవురు నాగేశ్వరరావు, పొన్నాల నాగబాబు, బొక్క చక్రవర్తి, నడిపూడి కృష్ణ, రెడ్డి శ్రీను, పులపర్తి దత్తు పాల్గొన్నారు.

ఎల్‌బి చర్లలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని ఎల్‌బి చర్ల, చామకూరిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ.అనిల్‌కుమారి మాట్లాడుతూ వరిలో సస్యరక్షణ యజమాన్యంపై రైతులకు సలహాలు, సూచనలపై అవగాహన కల్పించారు. రైతులకు మేలు చేసే మిత్ర పురుగులు అయిన అక్షింతల పురుగు, తూనిగా, సాలీడు, మిడతలు వంటివి పంటకు హాని కలిగించే శత్రు పురుగులను ఆహారంగా తీసుకొని రైతులకు ఎంతగానో మేలు చేస్తాయి. రైతులు ఎక్కువగా పురుగు మందులు వాడటం వల్ల మేలు చేసే మిత్ర పురుగులు చనిపోవడం వల్ల పంటకు హాని కలిగే శత్రు పురుగుల బెడద ఎక్కువై పంటకు హాని కలుగుతుంది. కాబట్టి రైతులు పురుగుల తెగుళ్లను బట్టి మాత్రమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎఎ సాయిదుర్గ, ఎహెచ్ఎ చందుకుమార్, విఎఫ్ఎ రాజు, కటకంశెట్టి నాగ సంజీవరావు, పార్థసారధి, నారాయణరావు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ సంచాలకులు అనిల్‌కుమారి

CHANGE OF NAME

I, **ADDEPALLI BHRAMARAMBHA SITA PADHMAJA CHAITANYA** W/o. Addepalli Viswanadh, and Resident of D.No. 17-12-14, Lakshmivarapupeta, Near Ramalayam, Tangellamudi, ELURU, West Godavari District -A.P changing my Name from **ADDEPALLI BRAMARAMBA SITA PADMAJA CHAITANYA** (OLD NAME) to **ADDEPALLI BHRAMARAMBHA SITA PADHMAJA CHAITANYA** (NEW NAME) Hence forth Iam being called as **ADDEPALLI BHRAMARAMBHA SITA PADHMAJA CHAITANYA** (NEW NAME) for all purposes.

పాస్‌పోర్టు పోయినది

BARRI LAKSHMI NARASAMMA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.01-08-2024న C0654562 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్ పోర్టు జిరాక్స్ తీయించుకునేందుకు ది.15-10-2024న మా ఇంటి నుండి మొగలూరు సెంటర్‌కు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

BARRI LAKSHMI NARASAMMA
W/o. Barri Narayana Swamy
D.No. 6-89/1, ETIMONDI, Perupalem Post
Mogalturu Mandal, W.G.Dt., A.P.

పాస్‌పోర్ట్ పోయినది

ఆచంట మండలం, వల్లూరుకు చెందిన మానేపల్లి శ్రీనివాసరావు, తండ్రి: మానేపల్లి సత్యనారాయణ, డో.నెం.6-103(1), వల్లూరు, ఆచంట మండలం, ప॥గో॥జిల్లా, ఏపీ తెలియజేయునది ఏమనగా.., నేను వైజాగ్‌లో ది.04-2-2004న తీసుకున్న **E7394738 పాస్ పోర్ట్ పోయినది.** నేను ది.24-05-2024న వల్లూరులో మా ఇల్లు షిఫ్ట్ అవుతుండగా ఆ పాస్‌పోర్టు మిస్ అయినది. ఎంత వెతికినను ఎక్కడా దొరకలేదు. నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్‌కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

సెల్ నెంబర్: 9866196169

CHANGE OF NAME

I **Donadri Chinna Appanna, S/o. Donadri Hanumanthu** and Residing at D.No.13-202, Sai Nagar, Kothuru Road, Eluru, Eluru District, Andhra Pradesh, Pin: 534001, Cell No. 93945 60909. Changing My Name From **Donadri China Appanna (Old Name)** to **Donadri Chinna Appanna, S/o. Dondari Hanumanthu (New Name).** Hence Forth I am being Called as **Donadri Chinna Appanna (New Name).** For All Purposes.

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.50/2019 in O.S.No.131/2014

బిట్వీన్:

బాలనాగు సూర్యకుమారి
...పిటీషనరు /డిక్రీ హోల్డరు
అండ్
1) యండ్ర సత్యనారాయణ
2) యండ్ర మంగాభాయి
...రెస్పాండెంటు /జడ్జిమెంట్ డేటర్స్

టు:

1) యండ్ర సత్యనారాయణ, తండ్రి: రామదాసు, వయస్సు 65 సం॥లు, పురుషుడు, పోర, ఆచంట మండలం.
2) యండ్ర మంగాభాయి, భర్త: సత్యనారాయణ, వయస్సు 60 సం॥లు, స్త్రీ, పోర, ఆచంట మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంధములో జడ్జిమెంటు డేటర్స్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని **ది.08-11-2024వ తేదిన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును.** కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూల్

West Godavari District, Achanta Sub Registration District, Achanta Mandal, Achanta Village.
Item No.1: Ac.0-06 cents of Zeroyat wet land out of Ac.1-10 cents in R.S.No.635/3.
Item No.2: Ac.0-04 cents out of Ac.0-44 cents Zeroyat wet land in R.S.No.635/4.
Total extant of Item No.1 and Item No.2 is an extant of Ac.0-10 cents is a common plot bounded by:
East: Penumanchili Canal. ***West:*** Land of Yandra Manga Bai. ***South:*** Land of Jogi Sriramulu, Narayudu, Vendra Venkatarao. ***North:*** Lands of Manne Ramakrishna and his family members. With all easementary rights.

Amin Value : Rs.1,60,000/-
D.H.R.Value : Rs.1,37,546/-
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు, 22-10-24.
న్యాయవాది, పాలకొల్లు, ప॥గో॥జిల్లా.